క్లుప్తంగా

నేటి నుంచి క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలు

హన్మకొండ: కేసీఆర్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలు నేటి (బుధవారం) నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 17 సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో బుధవారం ఉదయం 11 గంటలకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్ ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా కుమార్



హసన్‌పర్తి: వాకర్స్ అసోసియేషన్ 303 జిల్లా కమిటి సంయుక్త కార్యదర్శిగా హసన్‌పర్తికి చెందిన బొక్క కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ప్రకటించారు. నియమాకానికి సహకరించిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఆసియాకు గోల్డ్‌మెడల్



న్యూశాయంపేట : ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఫోర్త్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో హంటర్‌రోడ్డులోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో బైపీసీ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని ఆసియా గోల్డ్‌మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం.నీరజ తెలిపారు. పోటీల్లో ఇండియా, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌కు చెందిన క్రీడాకారులు పాల్గొనగా వారితో తలపడి ఫైనల్స్‌లో విజేతగా నిలిచిందని పేర్కొన్నారు. ఆసియాను డీఎండబ్ల్యూఓ మురళీధర్ రెడ్డి, ఆర్ఎల్‌సీ శ్రీనివాస్ అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన న్యాయవాది శివ



వరంగల్ లీగల్ : హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను తన కార్యాలయంలో న్యాయవాది గంధం శివ కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల తనపై దాడి చేసిన హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, ఇతర సిబ్బందిపై చర్య తీసుకోవాలని కోరారు.

కోర్టులో ఉచిత కంటి పరీక్షలు



వరంగల్ లీగల్ : హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ అగర్వాల్ నేతృత్వంలో జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్.రమేష్‌బాబు ముందుగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఇరు బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, బాధ్యులు పాల్గొన్నారు.


నవధాన్యాలతో అభిషేకం

కాజీపేట: పట్టణంలో కొలువుదీరిన స్వయంభు శ్వేతార్కమూల గణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం స్వామివారికి నవధాన్యాలతో అభిషేకం నిర్వహించారు. పట్టణంలోని పుర విధుల్లో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్‌తో పాటు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కోటలో పర్యాటకుల సందడి

ఖిలా వరంగల్: కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటకు మంగళవారం భారీ సంఖ్యలో పలు పాఠశాలల విద్యార్థులు, పర్యాటకులు తరలివచ్చారు. దీంతో మధ్యకోట శిల్పాల ప్రాంగణం పర్యాటకులతో కిటకిటలాడుతూ సందడిగా మారింది. విద్యార్థులు, పర్యాటకులు, నగర ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి శిల్పాల ప్రాంగణంలోని శిల్పసంపద, ఖుషిమహాల్, ఏకశిల గుట్ట, రాతి మట్టి కోట అందాలను తిలకించారు.

దీపాదాస్‌మున్షీని కలిసిన ఎమ్మెల్యే



హసన్‌పర్తి : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డిలు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షీని మర్యాదపూర్వకంగా కలిశారు.

రైల్వేలో స్విగ్గీ, జొమాటో సేవలు

- ఐఆర్‌సీటీసీతో ప్రయాణికులకు స్విగ్గీ, జొమాటో ఫుడ్ డెలివరీ యాప్స్
- ఆర్డర్ చేసిన వెంటనే ట్రైన్ వద్దకే ఫుడ్



కాజీపేట జంక్షన్‌లోకి వెళ్తున్న ఫుడ్ డెలివరీ బాయ్స్

కాజీపేట రూరల్ : నేటి ఉరుకుల పరుగుల జీవన విధానంలో ఉద్యోగం, డబ్బులు ఉండి సమయానికి ఫుడ్ తినలేని వారికి స్విగ్గీ, జొమాటో ఫుడ్ డెలివరీ యాప్స్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు స్విగ్గీ, జొమాటో సేవలు హౌజ్, అపార్ట్‌మెంట్, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ఇతరత్రా పంక్షన్లకే పరిమితం కాకుండా ఇప్పుడు రైల్వే స్టేషన్లోకి ఎంట్రీ అయి రైళ్లో కూర్చున్న ప్రయాణికుల వద్దకు వచ్చి ఫుడ్ సర్వీస్ అందిస్తూ మరింత ముందుకు సాగుతున్నాయి. ఐఆర్‌సీటీతో స్విగ్గీ, జొమాటో వారు భాగస్వామ్యమై ప్రయాణికులకు మరిన్ని సేవలు అందిస్తున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు రైళ్లో రిజర్వేషన్ కోచ్‌లలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు కూర్చున్న వద్దనే టిఫిన్, లంచ్, డిన్నర్ కావాలంటే ఐఆర్‌సీటీసీ యాప్‌లోకి వెళ్లి సర్వీస్ పొందవచ్చును.

స్విగ్గీ, జొమాటో సేవలు ఇలా

ముందుగా ఐఆర్‌సీటీసీ యాప్ ఓపెన్ చేసి ప్యాసింజర్ ట్రైన్ టికెట్ పీఎన్ఆర్ నంబర్‌ను ఎంటర్ చేస్తే ఫుడ్ ఆన్ ట్రైన్ వస్తుంది. ఇందులో మనకు నచ్చిన హోటల్‌లోకి వెళ్లి ఫుడ్ రిసీవ్ చేసుకునే రైల్వే స్టేషన్‌ను, ఫుడ్‌ను స్విగ్గీ, జొమాటో ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టుకోవాల్సి ఉంటుంది. సెలెక్ట్ చేసుకున్న రైల్వే స్టేషన్ వద్దకు రైలు స్టేషన్‌కు వచ్చే సమయానికి ముందు స్విగ్గీ, జొమాటో బాయ్స్ తమ ఫుడ్‌ను పట్టుకొని రెడీగా ఉంటారు. ఒక్కోసారి ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండి ప్రయాణికులు సమయానికి ఆర్డర్ పెట్టిన ఫుడ్ అందక పోతే వారి డబ్బులు వారికి రిఫండ్ చేస్తారు. కాజీపేట జంక్షన్ నుంచి తెలంగాణ, రాజధాని, వేయిన్‌గంగా, చార్మినార్, గోదావరి ఎక్స్‌ప్రెస్‌లకు ఎక్కువ సర్వీస్ అందిస్తున్నట్లు ఆర్డర్‌లో ఫుడ్‌ను తీసుకవచ్చిన స్విగ్గీ సూపర్‌వైజర్ అజార్ తెలిపారు.

వలంటీర్లు అత్యుత్తమ సేవలందించాలి

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి : ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆపద మిత్ర వలంటీర్లు అత్యుత్తమ సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సంస్కృతీ విహార్‌లో అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో 12 రోజుల పాటు నిర్వహిస్తున్న ఆపద మిత్ర వలంటీర్ల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఇతర శాఖల సమన్వంతో సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు. హనుమకొండ జిల్లా అగ్నిమాపక అధికారి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అగ్నిమాపక అధికారి వెంకట సతీష్‌కుమార్, తహసీల్దార్ చల్లా ప్రసాద్, డీటీ రహీం, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కుల గణన రిపోర్టు ఆమోదయోగ్యం కాదు

హన్మకొండ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు అన్నారు. మంగళవారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్రంలో చేసిన కుల గణన తప్పుల తడుక అని, అశాస్త్రీయమని, దీంతో బీసీలకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకునికి రాసిన లేఖను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభాకి సంబంధించిన సమాచారం అశాస్త్రీయంగా ఉందన్నారు. కుల గణన రిపోర్టుపై బీసీలకు ఉన్న అభ్యంతరాలను గాంధీకి మెయిల్ ద్వారా తెలియజేసి అన్యాయం జరుగకుండా చూడాలని కోరామన్నారు. బీసీ నాయకులు సతీష్, ఆనందం, రాజమౌళి, అంజన్‌రావు, వేణు చారి, సురేందర్, పాల్గొన్నారు.

మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులే

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

న్యూశాయంపేట : దేశంలో మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కార్యాలయంలో పార్టీ శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల దేశంలోని అనేక రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బీజేపీని ఓడించడంలో చతికిలపడిందన్నారు. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారని అన్నారు. తెలంగాణలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సదాలక్ష్మి, టి.భిక్షపతి, ఎల్లేష్, లక్ష్మణ్, రాములు, సారంగపాణి, రాజు, అశోక్, శంకర్‌నాయక్, రాంచంద్రారెడ్డి, సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలి



హన్మకొండ: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని, తల్లిదండ్రుల కల సాకారం చేయాలని కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో మోషన్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు స్వేచ్ఛగా పరీక్ష రాయాలన్నారు. చదువులో ప్రతిభ కనబర్చి అత్యుత్తమ స్థానానికి ఎదగాలని సూచించారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మోషన్ జూనియర్ కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య చాలా కీలకమైందన్నారు.

హసన్‌పర్తి : యువత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని ఎంపీడీఓ కర్ణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ఈసందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో 'షైన్' ప్రభంజనం



జి.వికాస్



పి.శ్రీ మహేష్



సి.హెచ్.శ్రీతన్

హన్మకొండ: జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో హనుమకొండలోని షైన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. తమ కళాశాల విద్యార్థి 98.59 పర్సంటైల్ సాధించి కార్పొరేట్ విద్యాసంస్థలకు సమానంగా ఫలితాలు సాధించారని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్, డైరెక్టర్లు మూగల రమ, పి.రాజేంద్ర కుమార్, మూగల రమేష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో షైన్ విద్యార్థులు జాతీయస్థాయి ఫలితాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు మొదటి నుంచి జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్, నీట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో జి.వికాస్ 98.59 పర్సంటైల్ సాధించారని, పి.శ్రీమహేష్ 97.23, సి.హెచ్.శ్రీతన్ 96.04 పర్సంటైల్ సాధించారని వివరించారు. విద్యార్థులను షైన్ విద్యా సంస్థల చైర్మన్, డైరక్టర్లు అభినందించారు. కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల డైరెక్టర్ ఐఐటీ కో-ఆర్డినేటర్ రమేష్ యాదవ్, ప్రిన్సిపాళ్లు మారబోయిన రాజు గౌడ్, శ్రీనివాసన్, సంధ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ ప్రాంగణ పరిసర ప్రాంతంలో నివసిస్తున్న నిరుపేదలకు మంగళవారం జీసస్ ప్రేయర్ హాల్ ఆధ్వర్యంలో ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. జీసెస్ ప్రేయర్ హాల్ వ్యవస్థాపకుడు మరియదాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసునూరి మనోహర్ మాట్లాడారు.

ఏకాత్మ మానవతావాది పండిట్ దీనదయాళ్

వరంగల్: దేశ సమగ్రాభివృద్ధికి బాటలు వేసే ఏకాత్మ మానవతావాద సిద్ధాంతాన్ని ప్రపంచానికి అందించిన మహనీయుడు స్వర్గీయ పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని 21వ డివిజన్‌లో మంగళవారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఖిలా వరంగల్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఉపాధ్యాయ దీనదయాళ్ అని బీజేపీ మండల అధ్యక్షుడు నాగరాజు కొనియాడారు. మంగళవారం వరంగల్ కరీమాబాద్‌లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

గేయపరిమళాలు పుస్తకావిష్కరణ

హన్మకొండ కల్చరల్ : నగరానికి చెందిన రచయిత నోముల రాజు సంపాదకత్వంలో వెలువరిన గేయపరిమళాలు పుస్తకాన్ని పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం వీసీ నిత్యానందరావు, రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు ఆవిష్కరించారు. మంగళవారం మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లిలోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఆవిష్కరించారు.

మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నారు

హన్మకొండ చౌరస్తా : మూడు పర్యాయాలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కొనసాగిన అభ్యర్థులే మళ్లీ పోటీలో ఉంటూ ఉపాధ్యాయులు, అధ్యాపకులను మళ్లీ మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని టీజేఏసీ ఎమ్మెల్యే అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన రెండు జిల్లాల్లోని రెసిడెన్షియల్, పాలిటెక్నిక్, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పర్యటించారు.

దాడిచేసిన దుండగులను శిక్షించాలి

హన్మకొండ: చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన దుండగులను శిక్షించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు, కార్యదర్శి టి.హరికృష్ణ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ అదుపు తప్పుతున్న మతోన్మాద ఫలితమే రంగరాజన్‌పై దాడి అని విమర్శించారు. ఈ ఉన్మాద స్థితిలోకి వెళ్తున్న యువత హేతుబద్ధ ఆలోచన విధానం వైపు మళ్లించే విధంగా ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

వరంగల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆరెల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఈనెల 16న హైదరాబాదులోరాష్ట్రస్థాయి సదస్సుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో ఆయన ఆవిష్కరించారు.

చిత్రసీమ గౌరవాన్ని ప్రపంచానికి చాటిన అదీబ్ నజీర్

హన్మకొండ : వరంగల్ చిత్రసీమ గౌరవాన్ని ప్రముఖ సినీ దర్శకుడు, రచయిత, నిర్మాత, నటుడు అదీబ్ నజీర్ ప్రపంచస్థాయికి తీసుకెళ్లాడని మధు మిత్ర అసోసియేట్స్ వ్యవస్థాపకుడు, ఎండీ పిట్టల మధుసూదన్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ప్రతిభ, సృజనాత్మకత, కృషితో తెలుగు చిత్రపరిశ్రమ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టారన్నారు. వరంగల్ కళాకారులు, టెక్నీషియన్‌తో కలిసి నిర్మించిన «ఇది కల కాదు» చిత్రం అద్భుతమైన విజయాన్ని సాధించి, అంతర్జాతీయ సినీఉత్సవాల్లో «ఉత్తమ చిత్రం» అవార్డును అందుకుందన్నారు. సమావేశంలో సీఎస్‌ఓ అకాడమీ సీఈఓ ఎండీ.బషీర్, సినిమా నటి మాధురి, రోజా క్రియేషన్స్ అధినేత శ్యాం, మిమిక్రీ కళాకారుడు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

సేవలు వినియోగించుకోవాలి



ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కుర్తా అధ్యక్షుడు సదానందం

కేయూ క్యాంపస్: తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీల అభివృద్ధికి విద్యాబోధన, పరిశోధనల పరంగా సేవలు వినియోగించుకునేందుకు ఇటీవలే ఆచార్యుల ఉద్యోగ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంపుదల చేసినందుకు కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ బాధ్యులు, ఇతర రిటైర్డ్ ఆచార్యులు, ఓయూ, జేఎన్‌టీయూ రిటైర్డ్ ఆచార్యులు హర్షం వ్యక్తం చేశారు. 2019 యూజీసీ నిబంధనల ప్రకారం యూనివర్సిటీల్లో ఇంతకు ముందే 60 ఏళ్లకే ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ ఆచార్యులన జీఓ 3 ప్రకారం ఈఏడాది జనవరి 28 వరకు ఇప్పటికే 65 ఏళ్లు నిండని ఆచార్యులను సేవలను విద్యాబోధనకు, పరిశోధనలపరంగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నట్లు వారు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వసలహాదారులు వేం నరేందర్‌రెడికి, ఎమ్మెల్సీ కోదండరామ్‌కు, విద్యాశాఖ సెక్రటరీ యోగితారానాకు, ఉన్నతా విద్యామండలి వెస్‌చైర్మన్ పురుషోత్తం, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి వేర్వేరుగా కలిసి విన్నవించారు.

రక్తదానం సామాజిక బాధ్యత



హసన్‌పర్తి: రక్తదానం సామాజిక బాధ్యత అని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి సూచించారు. నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. నక్కలగుట్టలోని హెచ్‌డీఎఫ్ బ్యాంక్, లయన్స్‌క్లబ్, వరంగల్ సహకారంతో ఈకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విజయ్‌చందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఏడాది మూడు నుంచి నాలుగు సార్లు రక్తదానం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా 550 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కళాశాల కోశాధి కారి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ప్రిన్సి పాల్ అశోక్‌రెడ్డి, లయన్స్‌గవర్నర్ వెంకట్‌రెడ్డి, హెచ్‌డీఎఫ్ మేనేజర్ శివకుమార్, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సహకారం

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



చపాతి యూనిట్ నిర్వహణ సభ్యులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ : నగరంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సహకారం అందిస్తామని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే స్పష్టం చేశారు. ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా హనుమకొండ సుబేదారి ఫారెస్ట్ ఆఫీసు ప్రాంతంలో మెప్మా సహకారంతో ఏర్పాటు చేసిన లహరి చపాతి మేకింగ్ యూనిట్‌ను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహిస్తున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓం శ్రీభద్రకాళి గ్రూపునకు చెందిన సభ్యుల విన్నపం మేరకు చపాతి తయారీ యూనిట్ ఏర్పాటుకు మెప్మా నుంచి ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని యూనిట్ విస్తరిస్తే అందుకు కావలసిన ఆర్థికసాయాన్ని బల్దియా అందిస్తుందని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక ఎస్‌హెచ్‌జీలను ప్రోత్సహిస్తూ సబ్సిడీలు పొందేలా రుణాలను అందజేస్తూ సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, టీఎంసీ రమేశ్, కమ్యూనిటీ ఆర్గనైజర్ స్వాతి పాల్గొన్నారు.

తుది నిర్ణయం రిటర్నింగ్ అధికారిదే

- ఆర్డీఓ రమేశ్ రాథోడ్



మాట్లాడుతున్న ఆర్డీఓ రమేశ్ రాథోడ్

హసన్‌పర్తి : ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి ఫలితాలు వెలువడే వరకు వరకు తుది నిర్ణయం రిటర్నింగ్ అధికారి(ఆర్వో)దేనని ఆర్డీఓ రమేశ్ రాథోడ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మంగళవారం ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆర్డీఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల కమిషనర్ జారీ చేసిన నిబంధనలు అనుసరించి ఎన్నికల ప్రక్రియ కొనసాగించాలన్నారు. కొన్ని సందర్భాల్లో ఓటరు జాబితాల్లో ముందుగా ఇంటి పేరు, కొన్ని చోట్ల ఇంటి పేరు తర్వాత పొందపరుస్తున్నారన్నారు. ఓటరు జాబితాల్లో ఉన్న పేరు పరిగణలోకి తీసుకోకుండా నామినేషన్ పత్రంలో పొందపరిచిన పేరును లెక్కలోకి తీసుకోవాలన్నారు.

విత్‌డ్రాకు అభ్యర్థే రావాల్సిన అవసరం లేదు

నామినేషన్ విత్‌డ్రాకు అభ్యర్థే రావాల్సిన అవసరం లేదని ఆర్డీఓ రమేశ్ రాథోడ్ తెలిపారు. అభ్యర్థి పేరును ప్రతిపాదించిన వ్యక్తి వచ్చి ఉపసంహరణ పత్రం ఇచ్చినా తీసుకుని, ఆ తర్వాత సదరు అభ్యర్థికి ఫోన్‌ద్వారా సంప్రదించి నామినేషన్ ఉపసంహరించాలని చెప్పారు. విత్‌డ్రా తర్వాత ఒకే అభ్యర్థి పోటీలో ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిన తర్వాతే వారి సూచనల మేరకు ఏకగ్రీవమైనట్లుగా ప్రకటించాలని సూచించారు. పోటీదారుల నామినేషన్లను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఎంపీడీఓ కర్ణాకర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, పాల్గొన్నారు.

ఓంకార్ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐ నాయకులు

వరంగల్: బాలసముద్రంలోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన 'కాళోజీ కళాక్షేత్రం' ప్రక్కన రెండు ఎకరాల స్థలంలో రూ.50 కోట్ల నిధులతో 'ఓంకార్ విజ్ఞాన కేంద్రం'తో పాటు ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎంసీపీఐ నాయకులు మోర్తాల చందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలసముద్రంలోని 10 ఎకరాల భూమిని మంత్రిగా ఉన్న హయగ్రీవాచారి 1970 సంవత్సరంలో తన పలుకుబడిని ఉపయోగించి రెవెన్యూ అధికారులతో రికార్డుల్లో తన కుటుంబ సభ్యులు, తన బంధువుల పేర్లను నమోదు చేయించి సదరు ప్రభుత్వ భూమిని కాజేయాలని ప్రయత్నం చేశారని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో ఎంసీపీఐ నాయకులు సింగతీ సాంబయ్య, బిట్ల సమ్మయ్య,నర్సయ్య, రమేశ్, తిరుపతి, రవి, తదితరులు ఉన్నారు.

చికెన్ సెంటర్ నిర్వాహకుడికి జరిమానా

వరంగల్ : అపరిశుభ్ర పరిస్థితుల్లో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్న యజమానికి రూ.30 వేలు జరిమానా విధించినట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. నగర పరిధిలోని 31వ డివిజన్ న్యూశాయంపేట ప్రాంతంలో చికెన్‌షాపు నిర్వహిస్తున్న వినాయక చికెన్ సప్లయర్స్ యాజమాన్యం సరైన హైజీన్ పద్ధతులు పాటించకుండా షాపుతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా ఉంచడంతో పాటు చికెన్ వ్యర్థాలు నేరుగా డ్రైయిన్‌లోకి వదులుతున్నట్లు గుర్తించిన నేపథ్యంలో కమిషనర్ ఆదేశాలమేరకు జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో సానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నట్లు తెలిపారు.

23 నుంచి నాటక పోటీలు

హన్మకొండ కల్చరల్ : ఈ నెల 23నుంచి 26 వరకు హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ నిర్వహణలో తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు నిర్వహిస్తున్నామని సహృదయ సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహరబాబు, ప్రధాన కార్యదర్శి కుందావజ్జుల కృష్ణమూర్తి, సాంస్కృతిక కార్యదర్శి వనం లక్ష్మీకాంతారావు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సహృదయ సంస్థ 26 ఏళ్లుగా అనేక సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిందని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా ఆహ్వాన నాటక పోటీలను నిర్వహిస్తుందన్నారు. ఈ ఏడాది 24వ ఆహ్వాన నాటకపోటీలు కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రతీరోజు సాయంత్రం 6.30నుంచి రాత్రి 10గంటల వరకు రెండు నాటకాలను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ (ఎస్‌డీఎల్‌సీఈ) డైరెక్టర్‌గా ఎకనామిక్స్ విభాగం అధిపతి ఆచార్య బి. సురేష్‌లాల్ మంగళవారం ప్రొఫెసర్ వి.రామచంద్రం నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అకుట్ జనరల్ సెక్రటరీ ఆచార్య మామిడాల ఇస్తారి, పాలక మండలి సభ్యులు నిమ్మసుదర్శన్, చిర్ర రాజు, యూజీసీ కోఆర్డినేటర్ మల్లికార్జున్‌రెడ్డి, దూరవిద్య సైన్స్‌కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటగోపినాథ్, కేయూ దూరవిద్య ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొట్టె భాస్కర్, ఉపాధ్యక్షుడు ఎఫ్రిమ్ రాజు, వివిధ సంఘాల బాధ్యులు పూలబొకేలు అందజేసి అభినందించారు. అలాగే ఎస్‌డీఎల్‌సీఈ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల బాధ్యులు సురేష్‌లాల్‌ను సన్మానించారు.

పరామర్శ

హన్మకొండ: బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌ను శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, జెడ్పీ మాజీ చైర్మన్ సమ్మారావు, మాజీ ప్రిన్సిపాల్ అయిలయ్య, ఆయా పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. ఉప్పుగల్లులోని స్వగృహంలో వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.